క్లుప్తంగా

ఆర్థిక సాయం

పాపన్నపేట(మెదక్): మండలంలోని బాచారం గ్రామానికి చెందిన క్యాసగల్ల నాగరాజుగౌడ్ ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు నిజాంపేట జెడ్పీటీసీ విజయ్ కుమార్ సోమవారం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాం నరేశ్, ఆర్టీఐ కన్వీనర్ నారాయణ, సుధాకర్, మండల కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి భాగేశ్, దుర్గయ్య, అనిల్‌గౌడ్, జ్వాల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలి



ఎంపీడీఓ సీతారావమ్మకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామంలో క్రీడా ప్రాంగణ స్థలాన్ని కాపాడాలని ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈశ్వరప్ప, యూత్ నాయకుడు మల్లేశం కోరారు. ఈ మేరకు తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ సీతారావమ్మను సోమవారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారని, అందులో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్లాట్ల కోసం సర్వే చేశారన్నారు. ఇళ్ల స్థలాల కోసం మరో స్థలాన్ని పరిశీలించి, క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావ్, వీరప్ప, దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు నిర్వహించాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో ఘనంగా బోనాల వేడుకలను నిర్వహించాలని సర్పంచ్ మల్లేశ్ అన్నారు. సోమవారం సర్పంచ్ ఆధ్వర్యంలో బంగారమ్మ జాతర, ఆషాఢబోనాల ఏర్పాట్ల కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ జాతరను గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిఖం పరిశీలన

వెల్దుర్తి(తూప్రాన్): కబ్జాకు గురైన శిఖం భూమిని అధికారులు సోమవారం పరిశీలించారు. వెల్దుర్తి పంచాయతీ శెరీల శివారులో కొణాలకుంట శిఖం భూమిని ఓ రైతు ట్రాక్టర్లతో దున్నకం చేస్తున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ జయభారతిరెడ్డి, సర్వేయర్ యాదగిరి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. 826 సర్వేనంబర్‌లోని 20 గుంటల భూమిని కబ్జా చేసినట్లు గుర్తించి అడ్డుకున్నారు. మరోసారి శిఖం భూమిని కబ్జాకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వచ్ఛభారత్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా స్వచ్ఛభారత్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ ఏరియా సేల్స్ ఆఫీసర్ బలరాంశ్యాం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునేటప్పటి నుంచే స్వచ్ఛభారత్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. క్లీన్ ఇండియా, హెల్త్ ఇండియా లక్ష్యంతో ముందుకు సాగాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి, హెచ్ఎం బాలరాజు, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సతీశ్, ఉపాధ్యాయుడు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు



మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. మండలంలోని టిక్యాదేవమ్మ గూడెం తండాలోని పట్టా భూమిలో హిటాచితో మట్టి తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న విషయం మా దృష్టికి రాలేదని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు.

గుప్త నిధుల వేటలో..

పురాతన ఆలయాలు ధ్వంసం
- పలు చోట్ల విగ్రహాలు అపహరణ
- పట్టించుకోని పురావస్తు శాఖ
- చర్యలు చేపట్టాలని డిమాండ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పురాతన దేవాలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలకు రక్షణ లేకుండా పోతోంది. గుప్త నిధులు దొరుకుతాయనే ఆశతో కొందరు దుండగులు విగ్రహాలను ధ్వంసం చేయడంతో పాటు, పలు దేవతామూర్తుల విగ్రహాలను ఎత్తుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. మండలంలోని ఫైజాబాద్ గ్రామ శివారులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొన్నేళ్ల క్రితం గుప్త నిధుల కోసం వచ్చిన దొంగలు స్వామివారి విగ్రహం శిరస్సును ధ్వంసం చేశారు. నిధుల కోసం గర్భగుడిలో తవ్వకాలు జరుపుతుండటం, విగ్రహాలను అపహరించడం ఆందోళన కలిగిస్తోంది.

- 900 ఏళ్ల చరిత్ర ఉన్న చిలప్‌చెడ్ మండలంలోని చండూర్ గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో భారీ నంది విగ్రహం శిరస్సును ధ్వంసం చేసి చండూర్ గ్రామ చెరువులో పడేశారు.
- అజ్జమర్రి గ్రామంలో సుమారు 200 ఏళ్ల క్రితం నాటి వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. గ్రామంలోని వృద్ధులను దేవాలయం గురించి వివరణ కోరగా వారి చిన్నతనం నుంచే గుడి శిథిలావస్థలో ఉందని చెప్పారు.
- ప్రస్తుతం ఈ ఆలయం పూర్తిస్థాయిలో శిథిలమైంది. ఆలయంలో ఉన్న వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని, భారీ నంది విగ్రహాన్ని దొంగలు అపహరించారు.
- అధికారులు, ప్రజాప్రతినిధులు పురాతన ఆలయాలను అభివృద్ధి చేసి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఫైజాబాద్‌లో శిథిలావస్థలో వేంకటేశ్వర ఆలయం



చండూర్ రామలింగేశ్వర ఆలయంలో పాక్షికంగా ధ్వంసమైన విగ్రహాలు

ఆలయం శిథిలమైంది

అజ్జమర్రి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. అందులోని దేవతామూర్తుల విగ్రహాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆలయ అభివృద్ధికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.



– సురేందర్‌రెడ్డి, అజ్జమర్రి

కమిటీ వేసినా ఫలితం లేదు

ఫైజాబాద్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాల అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేశాం. అప్పట్లో టీటీడీ సభ్యులు ఆలయాన్ని సందర్శించారు. అభివృద్ధిలో ఎలాంటి మార్పు లేదు. రోజురోజుకు ఆలయం శిథిలమైపోతుంది.



–ఎంసీ విఠల్, ఫైజాబాద్

మరణించి.. చిరంజీవిగా నిలిచి..



రాకేశ్‌కు ఆస్పత్రి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): మండలంలోని కె. వెంకటపూర్ గ్రామానికి చెందిన ఒక యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో అతని అవయవాలను వారి తల్లిదండ్రులు దానం చేశారు. వివరాలలోకి వెళ్లితే... మండలంలోని కె. వెంకటపూర్ గ్రామానికి చెందిన గైసింగారం మంజుల రాజు దంపతుల కుమారుడు రాకేశ్(19) శుక్రవారం కామారెడ్డి జిల్లాలోని బస్వాపూర్ గేట్ సమీపంలో కారు బైక్ ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయలు కాగా వెంటనే కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. రాకేశ్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు రాకేశ్ అవయవాలను మరో కుటుంబానికి వారు దానం చేశారు. దీంతో మృతదేహానికి ఆస్పత్రి వద్ద సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్, దయాకర్, నందు, ధర్మారెడ్డి, రాజేందర్, స్వామి ఉన్నారు.

‘సుప్రభాతరావు క్షమాపణలు చెప్పాలి’



మాట్లాడుతున్న శ్యాంరెడ్డి

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులనుద్దేశించి పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు చేసిన ఆరోపణలు అవాస్తవమని, ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పలు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు డిమాండ్ చేశారు. రామాయంపేట, చిన్నశంకరంపేట, హావేలీఘనాపూర్, నిజాంపేట, పాపన్నపేట మండలాల పార్టీ అధ్యక్షులు శ్యాంరెడ్డి, రమణ, శ్రీనివాస్, లింగంగౌడ్, గోవింద్ నాయక్ సోమవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడుతూ... కార్యకర్తల శ్రేయస్సు గురించి ఏ రోజూ పట్టించుకోని సుప్రభాతరావు, తమను కించపరుస్తూ తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అనిల్‌కుమార్, పార్టీ మెదక్, రామాయంపేట పట్టణాధ్యక్షులు ఆంజనేయులు, చింతల యాదగిరి, జిల్లా కార్యదర్శి బైరం కుమార్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కిషన్, హరిప్రసాద్, భాను, సతీశ్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



పెద్దశంకరంపేట(మెదక్): చీలాపల్లిలో పాఠం చదువుతున్న విద్యార్థి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని చీలాపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులతో పఠనోత్సవాన్ని నిర్వహించారు. జులై 31 వరకు అన్ని పాఠశాలలో ప్రతీ పీరియడ్‌లో 10 నిమిషాలు విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించాలని నోడల్ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వెంకటేశం, రామచంద్రాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌రూరల్: పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం లభిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు బాబురావు అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డిపల్లి పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక పఠనం ప్రాముఖ్యత గురించి వ్యక్తిత్వ వికాస నిపుణులు బాబురావు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలను చదివి మహాత్మాగాంధీ, అబ్రహం లింకన్, అంబేడ్కర్ వంటి ఎందరో మహనీయులు ఉన్నత స్థాయి చేరుకున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: పేదలకు మేలు చేయాలన్న లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ సీఎం రిలీఫ్ ఫండ్ పథకం అమలు చేస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ఆమె సోమవారం హైదరాబాద్ తన గృహంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కాగా శివ్వంపేట మండలంలోని గోమారం, హత్నూర మండలంలోని సిరిపుర గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులతో పాటు ఇంకా పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

పాత పెన్షన్ సాధన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చిన్నశంకరంపేట(మెదక్): పాతపెన్షన్ విధానం అమలు కోసం నిర్వహిస్తున్న పాతపెన్షన్ విధాన సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు దేవయ్య అన్నారు. సోమవారం చిన్నశంకరంపేటలో పాతపెన్షన్ విధాన సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, చరణ్‌సింగ్, చంద్రం, యాదవరెడ్డి, రత్నాకర్, అశోక్, రమేశ్, పలువురు టీఎస్ సీపీఎస్ ఈయూ నాయకులు పాల్గొన్నారు.

మెదక్ కలెక్టరేట్: ఉద్యోగ ఉపాధ్యాయులందరికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈనెల 16న జోగులాంబ గద్వాల్‌లో బస్‌యాత్ర ప్రారంభం కానున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్‌సింగ్, కోశాధికారి చంద్రం, రాష్ట్ర సహ అధ్యక్షుడు దేవయ్య, యాదవరెడ్డి, రత్నాకర్, రాష్ట్ర కార్యదర్శులు అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పత్తి పంట భద్రంగా ఉండడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని చండూర్ గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పత్తి పంటలో కలుపు యాజమన్యం గురించి రైతులకు వివరించామన్నారు. పంటలో ప్రతీ వారం, పదిరోజులకోసారి పలు దఫాలుగా కలుపు తీయాలన్నారు. కలుపు తీస్తే పైరు పెరుగుదల బాగుటుందన్నారు. అదే విధంగా పత్తి మొలకెత్తిన నెలరోజులకు గడ్డి, కలుపు నివారణకు క్విజలోఫాప్ ఈథైల్ 400 ఎంఎల్, లేదా ప్రోపాక్విజాఫాప్ 250 ఎంఎల్, 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మమత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మారుతున్న కాలానికి అనుగుణంగా జీవశైలిలో మార్పులు రావాలని కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మమత అన్నారు. సోమవారం ఆమె ఫౌండేషన్ సభ్యులతో కలసి మండలంలోని సోమక్కపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిరెద్దుగూడెంలో బాల్యవివాహాల నిర్మూలన, బాలల హక్కులపై ఇంటింటికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. బాల్య వివాహాలే లేని సమాజం కోసం తమ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. గంగిరెద్దుల గూడెంలో పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దుర్గమణి, సత్యనారాయణ, గూడెం పెద్దలు అంబయ్య, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



కౌడిపల్లి(నర్సాపూర్): మొక్కలు నాటుతుండగా పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని సంకాపూర్‌లో సోమవారం గ్రామ సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ అనిల్‌గౌడ్ గ్రామస్తులకు పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ మొక్కలను నాటి జాగ్రత్తగా సంరక్షించుకోవాలని వారు సూచించారు. ఈ మేరకు ప్రతీ ఇంటికి ఐదు మొక్కల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్, గ్రామస్తులు, ఉపాధి క్షేత్ర సహాయకులు హాజరయ్యారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ గ్రామంలో హరిత హారం మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని రాయిలాపూర్, నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో హరిత హారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో లక్ష్యం మేరకు మొక్కలు నాటి, సంరక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కురుమ శేఖులు, ఎల్లం, సీనియర్ అసిస్టెంట్ బలరాం, పంచాయతీ కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల లైబ్రరీకి పుస్తకాల బహూకరణ



పుస్తకాలు బహూకరిస్తున్న ఎన్ఆర్ఐ రమేశ్

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ సంస్థ ప్రవాసభారతీయ వాసవీ సంఘం తరఫున రూ.40 వేల విలువైన పుస్తకాలను సోమవారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి వరద రమేశ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో 200 లైబ్రరీలకు పుస్తకాలను అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 44 పాఠశాలలకు ఉచితంగా పుస్తకాలను అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల నర్సింలు, ఎస్ఎంసీలు జలజ, ప్రసాద్, పాఠశాల హెచ్ఎం సుమిత, ఉపాధ్యాయలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామంలో తన తండ్రి జ్ఞాపకార్థం గణేశ్‌నాయక్ సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గణేశ్‌నాయక్ 2021 నుంచి హిరియా నాయక్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులుగా కొనసాగుతున్నాడు. కార్యక్రమంలో శ్రీనివాస్ నాయక్, సతీశ్‌చారి, బ్యాంక్ సిబ్బంది విక్రమ్, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె



శివ్వంపేటలో సమ్మె చేస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్)/ టేక్మాల్(మెదక్)/ కౌడిపల్లి(నర్సాపూర్)/ నిజాంపేట(మెదక్)/పెద్దశంకరంపేట(మెదక్): జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు సమ్మె చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కార్మికులు వాపోయారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పోడుభూముల సమస్యలు పరిష్కరించాలి**

మెదక్‌జోన్: హవేళీఘనాపూర్ మండలంలోని వాడి పంచాయతీ దూప్‌సింగ్ తండాలో పోడు భూముల సమస్యను పరిష్కరించాలని గిరిజనులు సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డిని కలిశారు. అందుకు ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి కామారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పోడు పట్టాలు ఇప్పించేలా కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో వాడి సర్పంచ్ యామిరెడ్డి తదితరులు ఉన్నారు.

◆ **పరామర్శ**



మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ బడికోటి విఠల్‌రెడ్డి(84) అనారోగ్య కారణాలతో సోమవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. మెదక్ పట్టణ పురపాలక కౌన్సిలర్‌గా, వైస్ చైర్మన్‌గా, చైర్మన్‌గా బడికోటి విఠల్‌రెడ్డి విశేషమైన సేవలు అందించారని ఎమ్మెల్సీ గుర్తు చేసుకున్నారు. అలాగే మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మరణించిన విఠల్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు.

◆ **12న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు**

నర్సాపూర్: ఈనెల 12న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పూర్తి స్థాయిలో అందలేదని పాఠశాలలు, కాలేజీల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోరుతూ 12న విద్యా సంస్థల బంద్ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. జిల్లాలోని పాఠశాలలు, కాలేజీలు బంద్ చేసి తమతో సహకరించాలని ఆయన కోరారు.

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రేపు బుధవారం విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం మెదక్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోశ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న బంద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేశ్, జిల్లా అధ్యక్ష ప్రవీణ్, ఉపాధ్యక్షుడు జగన్, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, పీడీఎస్‌యూ నాయకులు రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని విద్యాసంస్థలకు ఈనెల 12న ఎస్ఎఫ్ఐ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదని అన్నారు.

◆ **ఉచితవైద్య శిబిరం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ నీరజ ప్రారంభించగా, గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ సంజయ్ , డాక్టర్లు నాగేంద్రప్రసాద్, వైష్ణవీ, రాజు, గ్రామ నాయకులు ఉన్నారు.

◆ **చిన్నారులకు పలకల అందజేత**

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలకలు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ మండల అధ్యక్షుడు అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. లయన్స్ సేవా కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులకు పలకలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు నాగరాజు సూర్యప్రకాశ్, సుఖేందర్, ఏలూరి సత్యనారాయణ, రాము తదితరులు ఉన్నారు.

◆ **ముళ్ల పొదల తొలగింపు**

మెదక్‌జోన్: పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం గ్రౌండ్‌లో పేరుకు పోయిన పిచ్చి మొక్కలను ఓ ఎస్ఐ 4 రోజుల నుంచి తొలగిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. మెదక్ పట్టణ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఎస్ఐ పోచయ్య నిత్యం మార్నింగ్ వాకింగ్ కోసం పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంకు వెళ్తారు. అందులో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో 4రోజులు నుంచి పెరిగిన పిచ్చి మొక్కలను ఆయన తొలగిస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు ఆయనను ప్రశంసించారు.

◆ **యువత ఉపాధి మెలకువలు నేర్చుకోవాలి**

మనోహరాబాద్(తూప్రాన్): యువత ఉపాధి కోసం టెక్నికల్ జాబ్‌ల కోసం ప్రత్యేక శిక్షణ, మెలకువలు నేర్చుకోవాలని ఎంపీపీ నవనీత అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండల పరిషత్ కార్యాలయం వద్ద డీఆర్డీఏ అధికారులు, వివిధ శాఖ అధికారుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత టెక్నిక్ సంబంధించిన పనులను నేర్చుకోవాలని, వారి కోసం డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా తరగతును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఎన్ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో జరిగే సోషల్ ఆడిట్ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రకాశ్, ఎస్ఆర్‌పీ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, ఏపీఓ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

◆ **106వ రోజుకు చేరిన దీక్షలు**

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం నాటికి 106వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం డివిజన్ మంజూరు చేసే వరకు ఆందోళన విరమించమని వారు పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌చేశారు.